కథా నిలయం
5327
శ్రీకాకుళం

# గాలిపాటు

"చెబితే మీరు నమ్మరు గాని-" అన్నాడు భావనారాయణ. సిగరెట్టు పొగ వయ్యారంగా గాలిలోకి వదులుతూ.

భావనారాయణను మేం కలుసుకొని చాలాకాలమైంది. ఈలోపుగా వాడిలో చాలా మార్పులొచ్చాయి. తలవని తలంపుగా వాడి కనేక అదృష్టాలు పట్టినట్టు గూడా విన్నాం. మామూలు సంగతినే, ఓ అపురూప విషయంగా మలిచి చెప్పగల భావనారాయణ, ఈసారి ఎలాంటి కథ చెబుతాడోనన్న తహతహ నాకు జాస్తయింది.

"తప్పకుండా నమ్ముతాం. తక్షణం ప్రారంభించు" అన్నాం.

భావనారాయణ, భావయుక్తంగా ఓ నవ్వు నవ్వి, సుతారంగా సిగరెట్టును దూరంలోకి విసిరి, ఓ సారి చేతి వేళ్ళు మెటికలువిరుచుకొని చెప్పసాగాడు.

ఇటీవల నేను ఝుట్ పట్ పిక్చర్సులో పనిచేస్తున్నట్టు చాలామందికి తెలియదనుకుంటాను. బహుశా తెలిసిగూడా ఉండదు. ఎందుకంటే, ఈ కంపెనీ ఇటీవలే ప్రారంభించబడింది. దీని కింకా పబ్లిసిటీ గట్రా ఇవ్వలేదు. అదీగాక ఈ కంపెనీవారు కార్యశూరులు గానీ, వాక్శూరులు కారు. చెయ్యదలుచుకున్న దేదో చప్పున చెయ్యడం వీరి ధ్యేయం. ఆపని పూర్తయిందాకా, అసలు దాన్ని ప్రారంభించినట్టు

గూడా ఇంకొకరికి తెలియనివ్వకుండా ఉండటం కంపెనీ నిబంధనల్లో వొకటి.

ఈ కారణంగానే మేము తీయదల్చుకున్న పిక్చరు పేరు ఇంకా బైటపెట్టలేదు. సత్యమన్నట్టు, అది పౌరాణికం! ఫోకాలేదు. కానీ ఈ సబ్జెక్టును ఇంతవరకూ ఎవ్వరూ ముట్టుకోలేదు. కనీసం మరొకరి ఊహలోకి వస్తుందన్నా నేను నమ్మను. కావడానికిది పౌరాణికమే అయినా, ఈ "కథ" మీ కే గ్రంథంలోనూ కనిపించదు. అని-ఎక్కడా లేనిదీ కాదు. దాదాపు పేపరువర్కంతా పూర్తయింది కనుక, రేపో మాపో, ప్రకటన రాబోతున్నది గనక, ఇప్పుడు దానిపేరు బైటపెడుతున్నాను.

అని ఓ క్షణం ఆగాడు భావనారాయణ. చిరునవ్వుతో మా అందరివంకా చూశాడు. సత్యందగ్గిర మరో సిగరెట్టు పుచ్చుకొని, అంటించాడు. గుండెల నిండుగా పొగ పీల్చి గప్పున వదులుతూ, ఏదో ఓ నిశ్చయానికొచ్చిన వాడిలాగా తలపంకించాడు.

"లంఖిణీ సమర్త."

మామధ్య బాంబు పడ్డా అంతగా చలించం; కానీ భావనారాయణ ప్రకటన అంతగా మమ్మల్ని అదరకొట్టింది. ఆమాట వినడంతోనే ఒకరిద్దరు మూర్ఛపడినంతపనీచేశారు. మరో ఇద్దరు హాహాకారాలుచేశారు. కాస్తో కూస్తో తట్టుకున్నవాణ్ని, నేనూ, నాదెళ్ళగాడూనూ.

నాకెందుకో భావనారాయణమీద అసహ్యంలాంటిది కలిగింది. ఇంతోటి గుడ్డిముండ కబురు చెప్పడానికి

'చెబితే మీరు నమ్మరు గానీ...' అంటూ కథ ప్రారంభించనక్కర్లేదు. నమ్మకపోవడాని కిందులో ఏముందీ? సమస్తచెత్తా చెల్లుబడే యన్న ఈ రోజుల్లో 'లంఖిణీ సమర్థ మాత్రం చెల్లుబడికాదా? ఇదేమంత గొప్పవిషయమని భావనారాయణ, పనిమాలా వచ్చి చెప్పడం?

"మరో విషయ మేమిటంటే" అన్నాడు వాడు సిగరెట్టును అరంగుళందాకా పీల్చి. ఈ సారి వాడికి వంటినిండా చెమటలు పట్టాయి. కళ్ళు ఏమాత్రమో ఎరుపెక్కాయి. మనిషి ఎవరో కుదుపుతున్నట్టు కదిలిపోతున్నాడు;

"దానికి - మాటలు, పాటలూ నేనే రాస్తున్నాను."

"హా!"

ఈ విభ్రమవలయంనుండి తేరుకోవడానికి, నామట్టుకు నాకు, పావుగంటకు పైగా పట్టింది. ఆశ్చర్యంతో భావనారాయణ కేసి చూశాను. నా కెందుకో వాడు కొత్త మనిషిలాగా కనపడ్డాడు. ఏవో అపూర్వమయిన శక్తులు వాడిలో వెల్లి విరిసినట్టుగా నా కనిపించింది. ఇదివరకటి భావనారాయణకూ, ఇప్పటి మనిషికీ, నా కెక్కడా పోలిక అందలేదు. నిముషం క్రిందట వాడిమీద కలిగిన అసహ్యం-పోనీ అసహ్యంలాంటిది - గూడా యిప్పుడు కలగడంలేదు. వా డేదో ఓ ఇంద్రపదవిని పొందినట్టూ, మే మంతా ఇంకా అధోలోకంలో పడి కొట్టుకుంటున్నట్టూ అనిపించింది.

ఇవన్నీ సరేగానీ, ఇంతమంది హేమాహేమీలం, ఇక్కడుండగా, ఈ భావనారాయణగా డెలా ఈ ఛాన్సు సంపాదించాడు? వీడి కీ అవకాశం ఎలా దొరికింది?

"ఇన్నిటికీ చెప్పొచ్చేదేమిటంటే-" అన్నాడు భావనారాయణ, సిగరెట్టును దూరంగా విసిరేస్తూ.

"ఎంత రహస్యంగా ఉంచినా, ఈ సంగతి ఎలా తెలిసిందో, నలుగురికీ తెలిసింది. ఇంతకాలంనుండీ, నేను ఎదురు పడితే మొఖం తప్పించిన చాలామంది పెద్దమనుషులు, ఇప్పుడు నా చుట్టూ మూగుతున్నారు. నా మాట వింటేనే భగ్గుమని మండిపడే చాలామంది, గంటలకు గంటలు నాతో గడపడానికి సంతోషంగా అంగీకరిస్తున్నారు. ఇదంతా దేని కోసమో నాకు తెలుసు; దీనికి కారణంగూడా నాకు తెలుసు."

అని మళ్ళీ ఆగాడు భావనారాయణ. తరువాత మెల్లగా తలొంచుకొని, తనలో తనే నవ్వుకుంటూ పొడి దగ్గు దగ్గాడు.

"మొన్నటి ఉదయం-సుమారు పదిగంటలవేళప్పుడు, గదిలో కూచుని ఏదో రాసుకుంటున్నాను. ఏదో ఏమిటి ? స్క్రిప్టే రాస్తున్నాను. 'లంఖిణీ సమర్త' అయినప్పుడు, అక్కడి దృశ్యాలను ఎలా వర్ణించవలసిందీ, ప్రొడ్యూసరు చెప్పాడు. రెండు డాన్సులూ, రెండు కోరస్ పాటలూ విధిగా ఉండితీరాలని డిస్ట్రిబ్యూటర్ పట్టుబట్టాడు. యమకమైన పదాలతో ధను వెగిరిపోయే పాట రాయాలని నేను ప్రయత్నిస్తున్నాను. ఎంతకీ ఓ ముక్కన్నా రాయలేక పోయాను. సరిగ్గా అదేసమయంలో——"

అని జేబుగుడ్డతో చెమట తుడుచుకున్నాడు భావనారాయణ.

"బాబూ!" అన్నమాట వినిపించింది. తలెత్తాను.

"ఎక్కడో చూచిన మొఖం. ఎక్కడ చూశానో జ్ఞాపకం రాలేదు. నా అవస్థ గ్రహించినదానిలాగా—

"నన్ను శోభనాచలంలో చూసిఉంటారు" అన్నదామె.

"అవును. ఆవిణ్ణక్కడే చూశాను. ఆరోజున ఆవిడేదో చిన్న వేషం వేసింది. వేషంలో చూడటంచేత, ఇప్పుడామెను వెంటనే గుర్తుపట్టలేకపోయాను.

"చాలా అవస్థగా ఉంది బాబూ! ఎక్కడా వేషాలు లేవు. ఉన్న నాలుగింటికై నా వెంటనే డబ్బులు పడవు. ఒక్కో వెధవ ఆరు రూపాయలకోసం ఆరు వందలసార్లు తిప్పుతుంటాడు. మూడునెల్ల అద్దె కట్టాలి. నిన్న ఉదయం నించీ తిండి లేదు."

"ఆ పై మాటలు ఆమె అనలేకపోయింది. అప్పటికే ఆమెగొంతు, దుఃఖంతో పూడుకుపోయింది. కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలాయి. రెండు చేతులతోనూ ముఖం కప్పుకొని బావురుమని ఏడ్చింది.

ఆ క్షణాన నాదగ్గర నాలుగు వేలుంటే ఆమె కిచ్చి ఉండేవాణ్ని. దురదృష్టవశాత్తూ నాలుగణాలున్నాయి. నాదగ్గర ఇంత మొత్తమే ఉన్నదని చెప్పుకోవడం నాకిష్టం లేదు. ఒకవేళ చెప్పినా ఆమె నమ్మదు. ఓ ఫిలిం కంపెనీకి. కథ రాస్తున్నవాడి దగ్గిర నాలుగణాలేనా ఉండటం ?

"అప్పుడు నే నెంతబాధపడ్డానన్నది, ముఖ్యం కాదు. ఎంతబాధపడ్డా ఆమెకు, ఆ నిముషాన, ఆ నాలుగణాలు మాత్రమే నే నివ్వగలిగాను.

"తాళాలు ఆఫీసులో మరిచిపోయాను. వాటికోసం ఇప్పుడే కుర్రాణ్ని పంపించాను. రావడానికి-బహుశా-చాలా టైం పడుతుంది. పోనీ, నువ్వెళ్ళమ్మా! నీ అడ్రసిచ్చి వెళ్లు, కుర్రాడికిచ్చి, తృణమో పణమో పంపుతాను. లేదా, ఇటు కేసివచ్చినప్పుడు నాకు మరోసారి కనిపించు."

"ఆ కొద్దిసహాయానికే, ఆమె, వంగి నా పాదాలకు నమస్కరించబోయింది. ముష్టి పావలాకోసం, ఓ మనిషి, ఇంకోమనిషికి, అంతగా కృతజ్ఞతను చూపడమంటే, ఆవ్యక్తి ఎన్ని బాధలుపడిఉండాలి? ఎంత నిరాశను ఎదుర్కొని ఉండాలి?

"ఒక్కసారిగా, నాకు ప్రపంచమంతా, చాలా దగా కోరుగా కనిపించింది. మోసానికి, అబద్ధాలకు, కుత్సితానికీ ఉన్న విలువ, ఈనాడునిజాయితీకి, సత్యానికి, రుజుమార్గానికి లేకుండాపోతోంది. ఈ ప్రపంచం బాగుపడే దెప్పటికి?

"ఆరోజు,ఆమరునాడుగూడా నాదగ్గర చిల్లికానీలేదు. నా ఖర్చుల్నే మరొకర్ని భరించుకోనిచ్చాను. మూడో రోజున గావును, ఈ ప్రొడ్యూసరు పాతిక రూపాయలిచ్చి 'అందాకా జరుపుకుంటూండండి'అన్నాడు. నిజానికి నాకున్న అవసరాలు, ఈ పాతిక ఎటుగూడి తీర్చలేవు. నాబాధలు నా కుండనేఉన్నాయి. కనీసం మరొకరికన్నా డబ్బు ఉపయోగపడితే—

"నా కళ్ళముందు, మొన్నటి ఎక్స్ట్రానటి రూపం మెదిలింది. అడ్రసు చూసుకొని ఆమెఇంటి కెళ్లాను. గది తాళంవేసి ఉంది. ఎక్కడి కెళ్లిందని ప్రక్కవారి నడిగాను. వారిచ్చిన సమాధానం నన్ను మరింత కుంగదీసింది. మూడు రోజులక్రిందట, ఆవిడ ఇల్లు ఖాళీచేసిందట. కనీసం, ఈ మూడురోజులూ ఆవిడ నాకోసం ఎదురుచూసి ఉంటుంది. వాకిట్లోకి ఎవరొచ్చినా నేనేనని భ్రమపడిఉంటుంది; ఇలా నమ్మించి మోసంచేసినందుకు, ఎన్నయినా తిట్టుకొని ఉంటుంది. కానీ, నేను మోసంచేయలేదనీ, నిజంగా చిల్లి కానీ లేని కారణాన, అటుకేసి రాలేకపోయాననీ ఆమెకు తెలియాలి. అందుకోసమన్నా నే నామెను కలుసుకోవాలి. అదీగాక-ఇంటద్దె చెల్లించని కారణాన, ఇంటివా రామెను వెళ్ళగొట్టి ఉంటారు. ఇప్పు డెక్కడుంటున్నదో? ఎన్ని అవస్థలుపడుతున్నదో మరి ?

"ఆమె కొత్త అడ్రసు కనుక్కొని ఆ ఇంటి కెళ్లాను. ఆ ఇంటిని చూస్తూనే, నేను పొరపడ్డానని తెలుసుకున్నాను. ఎందుకంటే అది రెండంతస్థుల మేడ. వాకిటిముందు జాజి పందిరి, పోలుపులుగా క్రోటన్లూ ఉన్నాయి. హాల్లో ఓ గుండ్రని బల్లా, చుట్టూ నాలుగైదు కుర్చీలూ ఉన్నాయి. వాకిళ్ళకు అందమైన సిల్కుతెరలు వేళ్ళాడుతున్నాయి. లోపలనించి రేడియో గావును, మధ్య మధ్య గురక పెడుతూ పాడుతున్నది. ఇదెవరో లక్ష్మీపుత్రు లుండవలసిన ఇల్లు గానీ, ఓ ఎక్స్ట్రానటి ఉండవలసినది కాదు; ఉండేదీ కాదు.

"నా పొరబాటుకు విచారిస్తూ వీధిలో కొచ్చి, మరో సారి ఇంటినెంబరు చూశాను. వారిచ్చిన నెంబరే సరయిందయితే, నేను పొరబాటుపడలేదన్నమాట. అయితే—

"ఇంతలోనే మెత్తగా చప్పుడు చేసుకుంటూ కారువచ్చి గేటుముందు ఆగింది. డ్రైవరు దిగి, తలుపు తీశాడు. దేవకన్యలా మెరిసిపోతున్న ఓ స్త్రీ అందులోంచి దిగింది. ఆమె నెక్కడ చూశానో జ్ఞాపకం తెచ్చుకునేలోగానే, ఆవిడ నన్ను చూసి, మెల్లగా నవ్వింది. కనురెప్పలు పైకి లాగి కుశల ప్రశ్నలువేసింది. జలతారు స్లిప్పర్లు టకటకలాడించుకుంటూ, హాండ్ బాగ్‌ను వయ్యారంగా ఊపుకుంటూ లోపలికెళ్ళిపోయింది.

"ఇప్పటికి ఆవి డెవరో మీకు తెలిసే ఉంటుంది. మూడు రోజుల్లో ఆ ఎక్‌స్ట్రానటికి ఇంత సిరి ఎలా అబ్బిందని నన్నడక్కండి. ఆ సంగతి మీ కెంత తెలుసో, నాకూ అంతే తెలుసు.

"మరో చిన్నరహస్యాన్ని చెప్పి నేను ముగిస్తున్నాను. కుమారి విపుల, ఎంబెరుమానార్ చెట్టి తీస్తున్న తొలిచిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఆ పిక్చర్‌కు మాటలు, పాటలు నేనే రాస్తున్నాను."

అన్నాడు భావనారాయణ పక్కున నవ్వి, ఒక్క సాగి భుజాలు కుదుపుకుంటూ.

---o---